విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే

సబ్ స్టేషన్ ఏర్పాటు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మూసాపేటలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, జూన్ 1 : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ గుట్టు సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వస్తున్నట్లు తెలిపారు. మూసాపేటలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ తోపాటు, మూసాపేట మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు, భూత్పూర్ మండలంలో 3 సబ్‌స్టేషన్లు, అడ్డాకుల మండలంలో 3 సబ్‌స్టేషన్‌లను ఈనెల 6వ తేదీన ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా మూసాపేటలోనే మొత్తం 9 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్సీ పీవీ రమేశ్, డీఈ చంద్రమౌళి, ఏడీ చంద్రశేఖర్, ఏఈ కిరణ్‌కుమార్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

నారాయణపేట, జూన్ 1 : జిల్లా కేంద్రంలో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగే వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి హాజరవ్వనున్నారు. పట్టణంలోని పరేడ్ మైదానంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్‌హక్ సాయుధ పోలీస్ బలగాల సెర్మోనియల్ గార్డ్ ఆఫ్ ఆనర్ రిహార్సల్స్ నిర్వహించారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బాంబ్ నిర్వీర్య పోలీస్ బృందం పోలీస్ జాగిలాలతో పరేడ్ మైదానం, కలెక్టర్ కార్యాలయం, కోర్టు ఆవరణం, జనసామర్థ్యం గల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, వాహనాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

నారాయణపేట : కలెక్టర్ కార్యాలయం వద్ద తనిఖీలు చేపడుతున్న బాంబ్ స్క్వాడ్ బృందం

వేడుకలను విజయవంతం చేయాలి

మక్తల్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మక్తల్ నియోజకవర్గంలోని భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చిన్న హన్మంతు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలనుసారం సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం 9:30 గంటలకు జాతీయ జెండావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భారత రాష్ట్ర సమితి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హాజరుకానున్న మాజీ మంత్రి

జడ్చర్ల, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూనగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలలో మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి సోమవారం ఉదయం 9గంటలకు జాతీయజెండాను, పార్టీ జెండాలను ఆవిష్కరిస్తారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూన్ 1 : మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా 30 పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో ఎస్సై పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి బహిరంగ సభలు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని, నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేర మనకు పురిగోల్పే ఎటువంటి ఆయుధములను వాడొద్దని ప్రజలకు ఇబ్బంది, చికాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం వంటివి నిషేధం, రాళ్లను జమచేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం, లౌడ్ స్పీకర్‌లు, డిజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేదము, నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీసు యాక్టు 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట, జూన్ 1 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఈనెల 30 వరకు నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 30 పోలీ స్ యాక్ట్ అమలులో ఉన్నందువలన పోలీసు అధికారుల అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా లో అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

మహబూబ్‌నగర్, జూన్ 1 : మహబూబ్‌నగర్ జిల్లాలోని 18 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి పోలీసు సేవా పతకాలు లభించాయని ఎస్పీ జానకి అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 18 మందికి ఈ పురస్కారాలు రావడంపై ఎస్పీ వారికి అభినందనలు తెలిపారు. ఉత్తమ పురస్కారాలు అందుకున్నా వారిలో ఎస్సై బాల్‌రెడ్డి, ఎస్సై సుజాత, ఏఎస్సై ముస్తాక్, ఏఎస్సై పద్మాలతా, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి, నర్సింహులు, నాగిరెడ్డి, యాదయ్య గౌడ్, రాజేందర్‌రెడ్డి, జెహీరుద్దీన్, మధుబాబు, సత్యనారాయణ గౌడ్, ఆల్తాఫ్ హుస్సేన్, సురేశ్, గోవర్ధన్ గౌడ్, రాజేందర్ గౌడ్, గిరయ్యా పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

నారాయణపేట టౌన్, జూన్ 1 : విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఎంపీజే(మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టీస్) జిల్లా అధ్యక్షుడు ఖాసీం హుస్సేన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీజే కార్యాలయంలో ఎంపీజే ఆధ్వర్యంలో గత నెలలో విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు సాజిద్ సిద్దిఖీ, ఉపాధ్యక్షుడు నసీరుద్దీన్, కోశాధికారి మహ్మద్‌హుస్సేన్, నాయకులు ఉస్మాన్ ఉబేదుల్లా, ముజాయిద్దీన్ సిద్దిఖీ, సర్ఫరాజ్ హుస్సేన్, యూసుఫ్‌తాజ్, సాయికుమార్, జహీరుద్దీన్ నాఫీ, అబ్దుల్ ఖాదర్, సలీం నవాబ్, గులాం గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను మార్చాలి

ఊట్కూర్, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు చేయడం దారుణమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మండిపడ్డారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం పునః పరిశీలించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలంటే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్ల సర్దుబాటు విషయం బడిబాట కార్యక్రమం పూర్తయిన తర్వాత అమలు చేయాలన్నారు. సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి చేయూత నందించాల్సి ఉందని గుర్తు చేశారు.

ముగ్గు పోశారు.. ఇల్లు మరిచారు

మాగనూరు, జూన్ 1 : మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ కోసం అధికారులు ముగ్గు పోసి ఇంటి నిర్మాణం మార్చారని మండల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి స్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇల్లు పథకంతో భూమి, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు రూ.5లక్షల లోపు ఇల్లు కట్టించాలని ఉద్దేశంతో ముందుగా మోడల్ హౌస్‌ను ప్రతి మండలానికి ఏర్పాటు చేసే విధంగా అధికారులు ఐదు నెలల కిందటే చర్యలు చేపట్టారు. కాగా ముగ్గు పోసి 5నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు మాగనూరు కృష్ణ మండలాల్లో ఎక్కడ కూడా మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టకపోవడంతో మండలంలో ఇందిరమ్మ ఇల్లు ఎలా కట్టుకోవాలనే విషయంపై మండల ప్రజలకు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో మోడల్ హౌస్‌కే దిక్కులేదని మరి ఇందిరమ్మ ఇల్లు ఎలా వస్తాయని సందేహాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో రహీమ తబీన్‌ను వివరణ కోరగా కృష్ణ మండలానికి అయితే మోడల్ హౌస్ అనేది రాలేదని మాగనూరు మండల కేంద్రానికి మోడల్ హౌస్‌కు భూమి పూజ చేసి ఐదు నెలలు అవుతుందని కానీ ఇంటి నిర్మాణం చేపట్టడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఇంటి నిర్మాణం చేపట్టకపోతున్నామని, కాంట్రాక్ట్‌ను వేరే వారికి ఇచ్చి ఇందిరమ్మ మోడల్ హౌస్ చేపడుతామని ఎంపీడీవో పేర్కొన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణం కోసం భూమిపూజ చేసిన ఎంపీడీవో, ఎమ్మార్వో(ఫైల్)

వేడుకలకు ముస్తాబవుతున్న కలెక్టరేట్

- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముస్తాబైంది. వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు కలెక్టర్ విజయేందిరబోయి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉదయం 9గంటలకు అమర వీరుల స్మారక స్థూపం వద్ద అమర వీరులకు నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఉదయం 9:30గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) వద్ద మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేసి పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9:40గంటలకు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సందేశం, 10గంటలకు తెలంగాణ అమర వీరుల కుటుంబ సభ్యులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఉదయం 10:20గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 11 గంటలకు స్టాల్స్ ప్రదర్శన అనంతరం కార్యక్రమం ముగింపు, తదుపరి తేనీటి విందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, కలెక్టరేట్ ఏవో శంకర్, ఆర్ఐలు నర్సింగ్, చైతన్య, ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పోలీసులకు గొర్రెల దొంగల అప్పగింత

మూసాపేట(అడ్డాకుల), జూన్ 1 : గొర్రెల దొంగతనానికి వచ్చారని ముగ్గురు వ్యక్తులను పోలీసులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం కందూరు గ్రామంలో రెండు రోజుల కిందట 20 గొర్రెలను రాత్రి సమయంలో దొంగలు ఎత్తుకెళ్లారు. శనివారం కందూరు అనుబంధ గ్రామమైన గౌరి డేవునిపల్లి గ్రామం వైపు గ్రామానికి చెందిన నక్క రాములు, పెద్ద ఆశన్న, అంజయ్యలకు చెందిన గొర్రెలను నిలుపుకున్నారు. అయితే రాత్రి పొద్దు పోయాక నక్క రాములు ఆపిన గెర్రెల మంద వైపు ముగ్గురు వ్యక్తులు సెల్‌ఫోన్ లైట్లు వేసుకొని వస్తున్నట్లు గుర్తించారు. కాపాలగా ఉన్న వారు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మంద వద్దకు రాకముందే అటు గ్రామస్తులు, ఇటూ కాపలదారులు కలిసి ముగ్గురిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని బందించి విచారించగా వనపర్తి జిల్లా ఖిల్లాఘణ పుర్ మండలంలోని మామిడిమాడకు చెందిన కృష్ణయ్య, బోయ శ్రీకాంత్, మధుగా చెప్పినట్లు తెలిపారు. అయితే వారు సెంట్రింగ్ పనులు చేస్తామని తెలిపారు. తమ గొర్రెలను ఎత్తుకెళ్లడానికి వచ్చారని అనుమానిస్తూ వారిని అడ్డాకుల పోలీస్‌స్టేషనకు సమాచారం ఇచ్చి వారిని పోలీసులకు అప్పగించుచున్నట్లు గెర్రెల కాపరులు తెలిపారు. ఈ విషయంపై అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులును వివరణ కొరగా ముగ్గురు వ్యక్తులను గొర్రెల దొంగతనానికి వచ్చారని తమ సిబ్బందికి అప్పగించిన మాటా వాస్తవమే అని చెప్పారు. ఈ విషయంపై విచారిస్తున్నట్లు తెలిపారు. మామిడిమాడ గ్రామస్తులతో విచారించగా వారు సెంట్రింగ్ పనులు చేసుకుంటున్నట్లు తెలిపారని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారించి ఉన్నతాధికారులు సూచన మేరకు వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై చెప్పారు.

నేటి ప్రజావాణి రద్దు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 1 : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జూన్ 2వ తేదీన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, జూన్ 1 : జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న కారణంగా సోమవారం నారాయణపేట కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు.

సంఘం కార్యవర్గం ఏర్పాటు

బాలానగర్, జూన్ 1 : మండల పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక భవానీమాత ఆలయంలో ఉదయం నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో అధ్యక్షుడుగా బిజ్జు శివప్రసాద్ ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శివప్రసాద్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకద్ర, జూన్ 1 : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నుంచి నిర్వహించే భూభారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ కృష్ణయ్య ఆదివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు టీంలుగా ఏర్పాడి ప్రతి రోజు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 3న లక్ష్మీపల్లి, అజిల్లాపూర్, 4న హజిల్లాపూర్, కోయిల్‌సాగర్, 5న బస్వాయిపల్లి, చిన్నరాజమూర్, 6న చౌదర్‌పల్లి, పెద్దరాజమూర్, 9న డోకూర్, నాగరాం, 10న గుడిబండ, బస్వాపూర్, 11న మినుగోనిపల్లి, గూర కోడ, 12న గోపన్‌పల్లి, పెద్ద గోప్లాపూర్, 13న జీన్గురాల, గద్దె గూడెం, 16న బల్సుపల్లి, 17న వెంకటాయపల్లి, 18న దేవరకద్ర తదితర గ్రామాల్లో గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు హాజరై సభలను విజయవంతం చేయాలని కోరారు.

3 నుంచి భూభారతి సదస్సులు

భూత్పూర్, జూన్ 1 : మండలంలో ఈనెల 3వ తేదీ నుంచి భూభారతి సదస్సులను నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ కిషన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉండగా రెండు బృందాలు ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీన గోప్లాపూర్, అన్నాసాగర్, 4న కరివెన, తాటికొండ, 5న మద్దిగట్ల, హస్నాపూర్, 6న వెల్కిచర్ల, పోతులమడుగు, 9న కొత్తూర్, రావులపల్లి, 10న తాటిపర్తి, కొత్తమొల్గర, 11న అమిస్తాపూర్, పాతమొల్గర, 12న భూత్పూర్, కప్పెట గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ కిషన్, నాయబ్ తాసీల్దార్ గీత, ఆర్ఐలు వెంకటేశ్, బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొంటారు.

రేపటి నుంచి ..

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూన్ 1 : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి చట్టం జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు కానున్న సందర్భంగా, అన్ని మండలాల్లోని ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులు 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కౌకుంట్ల తాసీల్దార్ సుందర్‌రాజ్ తెలిపారు. గ్రామాల్లో భూమి ఉన్న రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలుంటే ఈ సదస్సులో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కౌకుంట్ల మండలంలో ఈనెల 3వ తేదీన దాసర్‌పల్లి, 4న పుట్టపల్లి, 5న తిర్మలాపూర్, 6న ఇస్రంపల్లి, 9న ముచ్చింతల, 10న పేరూర్, 11న అప్పంపల్లి, 12న రేకులపల్లి, 13న కౌకుంట్ల మండల కేంద్రంలో సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు.

నవాబ్‌పేట ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌కు సేవాపతకం

నవాబ్‌పేట, జూన్ 1 : నవాబ్‌పేట మండలంలో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ)లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యాదగిరికి ఉత్తమ పోలీసు సేవాపతకం వరించింది. యాదగిరి కొంతకాలంగా మండలంలో అంకితభావంతో విధులు నిర్వహించినందుకు గానూ ఆయనను పోలీసు ఉన్నతాధికారులు ఈ పథకానికి ఎంపిక చేశారు. యాదగిరి ఎంపిక పట్ల మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్ఎన్ఆర్ క్వింటా ధర రూ.2,272

నవాబ్‌పేట మార్కెట్ యార్డుకు వచ్చిన వరిధాన్యం

నవాబ్‌పేట, జూన్ 1 : మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఆర్ఎన్ఆర్ సన్నరకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,272 ధర లభించినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. సన్నరకం ధాన్యానికి కనిష్ఠంగా రూ.1,612 ధర లభించినట్లు ఆయన వివరించారు. అలాగే దొడ్డురకం ధాన్యానికి గరిష్ఠంగా క్వింటాకు రూ.1,973, కనిష్ఠంగా రూ.1,602 ధర పలికినట్లు తెలిపారు. మొక్కజొన్న ధాన్యానికి రూ.2,230 ధర లభించినట్లు కార్యదర్శి తెలిపారు. ఆదివారం ఒక్క రోజే మార్కెట్‌కు సన్నరకం ధాన్యం 4,268 బస్తాల ధాన్యం రాగా.. 1,504 బస్తాల దొడ్డురకం ధాన్యం మార్కెట్ వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

హైమాస్ట్ వెలుగులేవీ..?

వెలుగని హైమస్టా లైట్లు

ధన్వాడ, జూన్ 1 : ధన్వాడ మండల కేంద్రంలో సంత బజార్, వెంకటేశ్వర స్వామి ఆలయం, ఎన్టీఆర్ కాలనీతో పాటు పలు చోట్ల హైమాస్ట్ లైట్లు వెలుగడం లేదు. దీంతో రాత్రి వేళలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలకేంద్రంతోపాటు గ్రామాల్లోనూ హైమాస్ట్ లైట్లు వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను విరమించుకోవాలి

మక్తల్, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్యచరణలను వెంటనే విరమించుకోవాలని నారాయణపేట జిల్లా డెమోక్రటిక్ టీచర్ ఫెడరేషన్ అధ్యక్షులు హైమావతి, ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర ఆదివారం తెలిపారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లకు అధికారం ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని, ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూనే, మరోవైపు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య కుదించుకు ఉత్తర్వులు జారీ చేయడం చూస్తుంటే సర్కారు విద్యపై ప్రభుత్వ ద్వంద వైఖరి బయటపడిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు అధికారులకు శిక్షణ, బడిబాట పేరుపై అనేక కార్యక్రమాలు చేపడుతూనే మరొకవైపు పిల్లలు తక్కువగా ఉన్నారన్న ఉద్దేశంతో టీచర్లను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేయడం ద్వారా, ప్రాథమిక పాఠశాలలపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు కచ్చితంగా అవసరమని, ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, అందుకు భిన్నంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయుల సర్దుబాటుకు శ్రీకారం చుట్టి ఉత్తర్వులు సైతం జారీ చేయడం ఎంతవరకు సమంజసం పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వం మాత్రం పదిమంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు, 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలనడం అశాస్త్రీయంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ చెప్పే విధానాన్ని చూస్తుంటే ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 18 సబ్జెక్టులకు 60 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యాబోధన చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వుల ప్రక్రియను వెంటనే విరమించుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), జూన్ 1 : చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన శివరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చింతకుంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోట రాము, చింతకుంట మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మోహన్ గౌడ్‌తదితరులు శివరెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నారాయణపేట రూరల్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్